
# సాక్షి నంద్యాల

సోమవారం । 13 । ఫిబ్రవరి । 2023

### గోవింద.. గోవిందా

ఆళ్లగడ్డ: అహోబిలం శ్రీలక్ష్మీనరసింహ స్వామి పార్వేట ఉత్సవ పల్లకీ ఆదివారం జి.జమ్ములదిన్నె గ్రామ తెలుపులపై కొలువుదీరగా భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



### రూ. 2 లక్షల విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న వివిధ పథకాలకు విశాఖపట్నంకు చెందిన టీవీఎస్‌జీ శంకర్ రూ. లక్ష, హైదరాబాద్‌కు చెందిన పీవీ ఫణికుమార్ రూ. లక్ష విరాళంగా అందజేశారు.



### టీబీ డ్యాం సమాచారం

| | |
|---|---|
| పూర్తి మట్టం | :1,633 అడుగులు |
| ప్రస్తుతం | :1,612.27 |
| టీఎంసీల సామర్థ్యం | :105.788 |
| ప్రస్తుతం | :42.247 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | :000 |
| ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు) | :9,421 |

## న్యూస్‌రీల్

### ఈ-కేవైసీ తప్పనిసరి

నంద్యాల(అర్బన్): రైతులు తప్పని సరిగా ఈ - కేవైసీ చేయించుకుంటేనే వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ పథకం లబ్ధి చేకూరుతుందని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 2,22,958 మంది పథకం లబ్ధిదారులు కాగా ఇప్పటి వరకు 1,83,908 మంది మాత్రమే ఈ -కేవైసీ చేయించుకున్నారని, మిగిలిన 40,048 మంది రైతులు ఈకేవైసీ తప్పని సరిగా చేయించుకోవాలన్నారు.

### విజయవాడ రైలు పొడిగింపు

నంద్యాల(రూరల్)/బనగానపల్లె రూరల్: నంద్యాల మీదుగా నడిచే ధర్మవరం-విజయవాడ (17216) ఎక్స్‌ప్రెస్ రైలును ఈ నెల 14వ తేదీ నుంచి మచిలీపట్నం వరకు పొడిగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే గుంటూరు ఏడీఆర్‌ఎం శ్రీకాంత్ ఆదివారం తెలిపారు. అనంతపురం, నంద్యాల, ప్రకాశం, గుంటూరు జిల్లాల నుంచి మచిలీపట్నం వెళ్లే రైల్వే ప్రమాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా హుబ్లీ-విజయవాడ (అమరావతి ఎక్స్‌ప్రెస్)ను నరసాపురం వరకు, నంద్యాల-కడప ప్యాసింజర్ రైలు రేణిగుంట వరకు పొడిగించేందుకు దక్షిణ మధ్య రైల్వే అధికారుల నుంచి అనుమతి ఉత్తర్వులు లభించాయన్నారు. త్వరలోనే ఉన్నతాధికారుల అనుమతితో ప్రారంభిస్తామన్నారు. ప్రస్తుతం గుంటూరు-గుంతకల్ రైల్వే డబ్లింగ్ నిర్మాణ పనులలో భాగంగా నంద్యాల మీదుగా పగటి వేళలో నడిచే రైళ్లను మాత్రమే రద్దు చేశామని, రాత్రి వేళల్లో నడిచే అన్ని రైళ్లు యాథావిధిగా నడుస్తాయన్నారు.

### సచివాలయ ఉద్యోగ సంఘం అధ్యక్షుడిగా రామకృష్ణ



నంద్యాల(సిటీ): ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య (87/2021) నంద్యాల జిల్లా కమిటీ అధ్యక్షుడిగా దేవనాల రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా స్థానిక కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురుస్వామి ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీగౌరి, ఉపాధ్యక్షులుగా సంపత్‌కుమార్, హుసేనయ్య, వెంకటేశ్వరమ్మ, కార్యనిర్వాహక కార్యదర్శిగా పద్మావతి, కార్యదర్శులుగా సురేష్, వెంకటేష్, షాహిన్‌తో పాటు మరో 9 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను సచివాలయ ఉద్యోగులు సన్మానించారు.

### జెడ్పీలో 'స్థానిక ' ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా

కర్నూలు(అర్బన్): ఈ ఏడాది మార్చి 13వ తేదీన నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాను జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రచురించడం జరిగిందని జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, వార్డు కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, శాసనసభ్యులు, ఎక్స్ అఫీషియో మెంబర్లు ఓటర్లుగా కలిగిన జాబితాలను ప్రచురించామని తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఫారం - 17లో వివరాలను పూర్తి చేసి తమ కార్యాలయం, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ఈ నెల 18వ తేదీలోగా అందించాలని పేర్కొన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అన్ని ఎంపీడీఓ కార్యాలయాల్లో కూడా ఓటు హక్కు కలిగిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల వివరాలను ప్రచురించామన్నారు.

### 3 టూరిస్ట్ పోలీసు కేంద్రాలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

మహానంది: జిల్లాలోని నల్లమల అటవీ పరిసరాల్లోని ప్రముఖ క్షేత్రాలైన శ్రీశైలం, మహానంది, అహోబిలం ఆలయాల్లో ఏపీ టూరిస్టు పోలీసు సేవా కేంద్రాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం ప్రారంభిస్తున్నట్లు నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. మహానంది క్షేత్రంలో ఏర్పాటు చేసిన ఏపీ టూరిస్టు పోలీస్ సేవా విభాగం ఔట్‌పోస్టు కేంద్రాన్ని ఆదివారం సందర్శించి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి ఆలయాలకు వచ్చే భక్తుల రక్షణ, మార్గనిర్దేశం చేస్తారన్నారు. ఏపీ టూరిస్ట్ పోలీస్ విధానం ద్వారా ఈవ్‌టీజింగ్‌ను అరికట్టడం, చోరీలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో నంద్యాల డీఎస్పీ సి.మహేశ్వర్‌రెడ్డి, స్పెషల్‌బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ దస్తగిరిబాబు, రూరల్ సీఐ రవీంద్ర, మహానంది ఎస్‌ఐ నాగార్జునరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





శ్రీశైలం చేరుకుంటున్న పాదయాత్ర భక్తులు



మల్లన్న దర్శనానికి క్యూ లైన్లలో వేచి ఉన్న దృశ్యం



పట్టువస్త్రాలు సమర్పించేందుకు వస్తున్న మంత్రి సత్యనారాయణ దంపతులు

# శ్రీశైలం.. ఉత్సవ శోభితం

- మల్లన్న చెంత బ్రహ్మోత్సవ సందడి
- భృంగివాహనంపై విహరించిన ఆదిదంపతులు
- కనులపండువగా గ్రామోత్సవం
- ఆకట్టుకున్న కళాకారుల విన్యాసాలు
- నేడు దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం వారిచే పట్టువస్త్రాల సమర్పణ



భృంగి వాహనాధీశుడైన మల్లన్న ఆలయ ప్రదక్షిణ చేస్తున్న దృశ్యం



కాలి నడకన శ్రీశైలం చేరుకుంటున్న చిన్నారులు

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల శోభతో శ్రీగిరి క్షేత్రం ఇల కైలాసంగా మారింది. దారులన్నీ శ్రీశైలం వైపు అన్నట్లుగా భక్తజనం తరలివస్తున్నారు. నల్లమల కొండల్లో ఓంకార నాదం మారుమోగుతోంది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవరోజు ఆదివారం భ్రామరీ సమేత మల్లికార్జున స్వామి భృంగివాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. వేలాది మంది భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకుని తరించారు. భక్తుల శివనామస్మరణ నడుమ స్వామిఅమ్మవార్లకు నిర్వహించిన గ్రామోత్సవం కనుల పండువగా సాగింది. ముందుగా అలంకార మండపంలో భృంగి వాహనాన్ని సుగంధ పుష్పాలతో అలంకరించి స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఆశీనులను చేసి అర్చకులు, వేదపండితులు వేదమంత్రోచ్చరణతో ప్రత్యేక పూజా హారతులిచ్చారు. అనంతరం భృంగివాహనాధీశులైన స్వామిఅమ్మవార్లను గ్రామోత్సవాన్ని దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారిచక్రపాణిరెడ్డి, ఈఓ ఎస్.లవన్న నారికేళాలు సమర్పించి ప్రారంభించారు. ఉత్సవం ముందు కళాకారుల నృత్యాలు, కోలాటాలు, గొరవయ్యలు నృత్యాలు భక్తులను అలరించాయి. భక్తుల శివనామస్మరణ, కళాకారుల సందడితో పరమేశ్వరుడి పరమభక్తుడైన భృంగి పులకించిపోయారు. వేలాది మంది భక్తులు స్వామి అమ్మవార్ల దివ్యమంగళస్వరూపాన్ని దర్శించి దీవెనలిమ్మని వేడుకున్నారు. గంగాధర మండపం నుంచి బయలువీరభద్రస్వామి ఆలయం వరకు గ్రామోత్సవం శోభయమానంగా సాగింది. ఉత్సవంలో దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు మధుసూదన్‌రెడ్డి, ఎం. విజయలక్ష్మీ, మాధవీలత, తస్నీరు ధర్మరాజు, హనుమంత్‌నాయక్, దేవస్థాన అధికారులు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు వ్యక్తిగతంగా పట్టువస్త్రాలు సమర్పించారు. మంత్రి వెంట చైర్మన్ చక్రపాణిరెడ్డి, ఈఓ లవన్న తదితరులు ఉన్నారు.

**శ్రీశైలంలో నేడు**

- మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవరోజు సోమవారం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లు హంసవాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. అనంతరం ఆలయ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహిస్తారు.
- విజయవాడ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం వారిచే శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.



గ్రామోత్సవంలో వినూత్న వేషధారణలో కళాకారులు



ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శన

**దారులన్నీ.. శ్రీగిరి వైపు**

శ్రీశైల మహాక్షేత్రంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు భక్తులు భారీగా తరలివస్తున్నారు. ఓం శంకరా, ఓం నమఃశివాయ, శంభో శివశంభో అంటూ భక్తులు శివనామస్మరణ చేసుకుంటూ శ్రీశైలం చేరుకుంటున్నారు. పాదయాత్ర, వాహనాల్లో భక్తుల రాకతో క్షేత్రం కిటకిటలాడుతోంది. వేకువజామునే పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్ల దర్శనానికి బారులుదీరారు. ఉచిత, శీఘ్ర(రూ.200), అతిశీఘ్ర(రూ.500), శివదీక్షా భక్తుల క్యూలైన్లు కిటకిటలాడాయి. భక్తుల రద్దీ దృష్ట్యా సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించారు. దేవస్థానం ఈఓ ఎప్పటికప్పుడు దర్శనం క్యూలైన్లను, ఆర్జితసేవల క్యూలైన్లను, ఆలయ ప్రాంగణాన్ని పరిశీలిస్తూ పరిస్థితిని సమీక్షిస్తున్నారు. క్యూకాంప్లెక్స్‌లో వేచి ఉండే భక్తులకు నిరంతరం అల్పాహారం, బిస్కెట్లు, మంచినీరు అందజేస్తున్నారు. అన్నదాన భవనంలో ఉదయం 10.30 గంటల నుంచి అన్నప్రసాద వితరణ చేపట్టారు. భక్తులకు కావాల్సిన లడ్డూ ప్రసాదాలను అందజేస్తున్నారు. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులన్నీ కిటకిటలాడాయి.

# కానరావా.. కైలాసవాసా!



నాగలూటి మెట్ల మార్గం ద్వారా పాదయాత్రగా వస్తున్న భక్తులు

- శ్రీశైలానికి పాదయాత్రగా చేరుకుంటున్న శివస్వాములు, భక్తులు
- సుదూర ప్రాంతాల నుంచి తరలివస్తున్న వైనం
- నల్లమల దారిలో నడలని భక్తిభావం
- ఏటా పెరుగుతున్న భక్తుల సంఖ్య

ఆత్మకూరు: వందల కిలో మీటర్ల దూరం.. కాలినడకన ప్రయాణం.. ఉదయం వణికించే చల్లని గాలులు, మధ్యాహ్నం వేళ మండే ఎండలు.. చీకటి పడితే కటిక నేల మీదనే బస.. ఆ మల్లికార్జునుడిని దర్శించుకోవాలనే భక్తి భావమే వాటిని అధిగమించి ముందుకు సాగనిస్తోంది. కాళ్లు పగిలినా.. మోకాళ్లు వాపొచ్చినా.. పాదయాత్ర భక్తులు ఎక్కడా ఆగడం లేదు. కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు వైద్యశిబిరాల వద్ద స్వాంతన పొంది.. అన్నదాన కేంద్రాల్లో కాస్త ఆకలి తీర్చుకుని మది నిండా భక్తి భావంతో శ్రీశైలం చేరుకుంటున్నారు. శివ దీక్షా భక్తులతో పాటు, సామాన్య భక్తులు కర్నూలు - గుంటూరు జాతీయ రహదారి పక్కన ఆత్మకూరు మండలం వెంకటాపురం వద్ద నల్లమల అభయారణ్యంలోకి ప్రవేశిస్తారు. అక్కడి నుంచి నాగలూటి వీరభద్రస్వామిని దర్శించుకుని మెట్ల మార్గం ద్వారా పెచ్చెర్వు చేరుకునే లోపే ఒంట్లో శక్తి తగ్గిపోతుంది. వందల సంఖ్యలో ఉన్న మెట్లను అతి కష్టం మీద ఎక్కాల్సి వస్తోంది. మెట్టు మెట్టు ఎక్కుతూ 'ఓం నమఃశివాయ' పంచాక్షరీ మంత్రంతో ముందుకు వెళ్లడం ఒక వంతు అయితే పెచ్చెర్వు అనంతరం భీమునికొలను చేరుకునే మార్గంలో కత్తుల కొండ భక్తులకు ఓ పరీక్షే. నల్లమల కొండలోని ఎర్రరాళ్లు కత్తులను పోలి ఉంటాయి. వాటిపై నడక అంత సులువు కాదు. భీమునికొలనులో దిగి కైలాసద్వారం చేరుకోగానే మల్లన్నకు చేరువ అయ్యామనే ఆనందం పాదయాత్ర కష్టాలు మరిచిపోయేలా చేస్తోంది. పాదయాత్ర ఎంతో కష్టమైనా భక్తులెవరూ సడలిపోవడం లేదు. ఏటేటా పాదయాత్ర భక్తుల సంఖ్య పెరుగుతూనే ఉంది. వీరి సేవలో దాతలు తరిస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలు, దాతలు ఏర్పాటు చేస్తున్న వైద్య, అన్నదాన శిబిరాలు భక్తులకు ఊరటనిస్తున్నాయి.

**పాదయాత్ర భక్తులకు సూచనలు..**

- శ్రీశైల పాదయాత్రకు వెళ్లే భక్తులు తప్పనిసరిగా మంచినీరు లేనిదే ముందుకు నడక సాగించవద్దు.
- కాలినడక భక్తులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరక తారు రోడ్డు మీద నడకసాగించవద్దు. రోడ్డు పక్కన ఉన్న మట్టిలో నడవాలి.
- నాగలూటి, భీమునికొలను వద్ద మెట్ల మార్గంలో భక్తులు తప్పనిసరిగా 5, 10 మెట్లు ఎక్కిన వెంటనే తప్పనిసరిగా విశ్రాంతి తీసుకోవాలి.
- మహిళలు, వృద్ధులు, చిన్నారులు ప్రతి 20 నిమిషాలకు ఒకసారి అలసట అనిపించిన వెంటనే విశ్రాంతి పొందాలి.
- రాత్రివేళ శివస్వాములు, భక్తులు తప్పనిసరిగా టార్చ్‌లైట్ ఉపయోగించాలి. ప్రధానంగా కత్తుల కొండ, భీమునికొలను వద్ద టార్చ్‌లైట్ లేకపోతే ప్రమాదాలు జరిగేందుకు అవకాశాలు ఉన్నాయి.
- శరీరంలో బాగా అలసట కనిపిస్తే వైద్య శిబిరాల్లో మందులు తీసుకుని ఆరోగ్యం కుదట పడిన తర్వాతనే ముందుకెళ్లాలి.

**ఐదేళ్లుగా నడుస్తున్నా**



పాదయాత్రగా 5 ఏళ్లు శ్రీశైలం వెళ్తున్నాను. ఈ ఏడాది బయలుదేరి ఆరో రోజు. కాళ్లు బొబ్బలు రాకుండా గోనెసంచులు కట్టుకున్నాను. మొదట గద్వాల నుంచి ఉండవల్లి, అలంపూర్, నందికొట్కూరు, జూపాడుబంగ్లా, ఆత్మకూరు మీదుగా వెంకటాపురం చేరుకున్నాం. మల్లన్న మీద ఉన్న నమ్మకమే మమల్ని ఇంత దూరం నడిపిస్తోంది. - స్వామన్న, గద్వాల

**బొబ్బలెక్కినా నడక ఆపలేదు**



నేను బెంగళూరు నుంచి 8 రోజులుగా పాదయాత్ర సాగిస్తున్నాను. కాళ్లు బొబ్బలెక్కినా నడక ఆపలేదు. అక్కడక్కడా వైద్యశాలల్లో మందులు తీసుకుంటూ ముందుకు సాగాను. అన్నదానాలు, వైద్యశిబిరాల వలన ఉపశమనం లభించింది. నొప్పులు ఉన్నప్పటికీ మల్లన్న దర్శనం కోసం వెళ్తున్నామనే ఆనందం ముందు ఏదీ కష్టం కాదు. - లక్ష్మన్న, బెంగళూరు

**సౌకర్యాలు పెంచాలి**



నేను పది సంవత్సరాలుగా పాదయాత్ర చేస్తున్నాను. అటవీ మార్గంలో వాటర్ బాటిల్, టార్చ్‌లు లేనిదే ముందుకు వెళ్లలేం. ఏటా పాదయాత్ర భక్తుల సంఖ్య పెరుగుతూనే వస్తోంది. పెచ్చెర్వు, నాగలూటి, భీమునికొలను వద్ద సౌకర్యాలు మరిన్ని కల్పించాలి. ముఖ్యంగా వైద్యశిబిరం, తాగునీటి వసతి ఏర్పాటు చేయాలి. - మోహన్, ఉరవకొండ

## పాణ్యం సిమెంట్స్‌కు పూర్వ వైభవం తెస్తాం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్థిక మంత్రి బుగ్గన, ఫ్యాక్టరీ చైర్మన్ జగద్రక్షనన్

- రానున్న రోజుల్లో దశల వారీగా అభివృద్ధి
- ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

బేతంచెర్ల: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తోడ్పాటుతో పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీకి పూర్వ వైభవం తీసుకొస్తామని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సిమెంట్ నగర్‌లోని పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీలో ఉత్పత్తిలో కీలకమైన కిలన్‌ను ఏర్పాటు చేసి ఆదివారం మంత్రి బుగ్గన, ఫ్యాక్టరీ చైర్మన్ జగద్రక్షనన్, గ్రూప్ ఎండీ శ్రీకాంత్‌రెడ్డి, డైరెక్టర్ పలని, వీపీ సుధాకర్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం మైన్స్‌లో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 1956లో దక్షిణ భారత దేశంలో మొట్టమొదటి ఫ్యాక్టరీ అని, ఎంతో మందికి ఉపాధి అందించిందన్నారు. అనంతరం ఫ్యాక్టరీ మూతపడి దాదాపు రెండు దశాబ్దాలుగా కార్మికులు, వ్యాపారుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిన తరుణంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చొరవతో కొత్త యాజమాన్యం గత ఏడాది ఉత్పత్తిని ప్రారంభించిందన్నారు. భవిష్యత్‌లో ఫ్యాక్టరీని దశల వారీగా అభివృద్ధి చేసి యువతకు ఉపాధి అవకాశాలు పెంచుతామన్నారు. సిమెంట్ నగర్ గ్రామం అనేది ఫ్యాక్టరీ ఆధారంగా ఏర్పడింది తప్పా వ్యవసాయం, వ్యాపారం గాని మరే ఆధారం ఇక్కడలేదన్నారు. అనంతరం కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ జీఎం రాఘవరెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యులు మూర్తుజావలి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలానికి 418 ప్రత్యేక బస్సులు

ఆత్మకూరు/ నంద్యాల(వ్యవసాయం): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి శ్రీశైల మహాక్షేత్రానికి 418 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు నంద్యాల జిల్లా ఆర్‌ఎం శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆత్మకూరు నుంచి శ్రీశైలానికి 42 బస్సులు, నందికొట్కూరు నుంచి 30, నంద్యాల 50, బనగానపల్లె 12 , డోన్ 17, కోవెలకుంట్ల 17, ఆళ్లగడ్డ 11, కర్నూలు(1) 54, కర్నూలు(2) 56, ఆదోని 67, ఎమ్మిగనూరు 62, పత్తికొండ 4 బస్సులను ప్రత్యేకంగా నడుపుతున్నట్లు చెప్పారు. ఈ నెల 16 నుంచి 19 వరకు బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. భక్తులు అందరూ ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## క్లుప్తంగా

### నేడు మార్కెట్‌యార్డుకు వాము తేవద్దు

కర్నూలు(అగ్రికల్చర్‌): కర్నూలు వ్యవసాయ మార్కెట్‌ యార్డులో ఈ నెల 13వ తేదీన వాము క్రయవిక్రయాలు చేపట్టడం లేదని మార్కెట్‌ కమిటీ సెక్రటరీ గోవిందు తెలిపారు. తెలంగాణలోని ఐజ ప్రాంతంలో జరిగే జాతరకు ఒంటెద్దు బండ్ల యజమానులు పోతుండటంతో వాము క్రయవిక్రయాలు ఇబ్బంది ఏర్పడుతుందని ఆయన తెలిపారు. అందువల్ల సోమవారం ఒక్కరోజు మార్కెట్‌ వాము తీసుకరావద్దని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో రైతులను కోరారు. మంగళవారం నుంచి శుక్రవారం వరకు యథావిధిగా వాము క్రయవిక్రయాలు జరుగుతాయని ఆయన ప్రకటించారు.

### చెరకు పంట దగ్ధం



కాలిపోయిన చెరకు పంటను చూపిస్తున్న రైతు

కౌతాళం: మండల పరిధిలోని కామవరం గ్రామంలో ఆదివారం విద్యుత్‌ ప్రమాదంతో మూడు ఎకరాల చెరకు పంట దగ్ధమైంది. రైతు నరసింహులు చేతికొచ్చిన పంటను కోయించాలని కూలీలను సిద్ధం చేసుకున్నాడు. పొలం నుంచి పొగలు వస్తుండడంతో దగ్గర వెళ్లి చూడగా విద్యుత్‌ తీగల నుంచి నిప్పురవ్వలు పడి పంట దగ్ధమైంది. రూ. 3లక్షల నష్టం వాటిల్లిందని, విద్యుత్‌ అధికారులు తనకు నష్ట పరిహారం చెల్లించాలని రైతు కోరుతున్నాడు.

### ఏపీ వైహెచ్‌పీఎస్‌ జిల్లా అధ్యక్షుడిగా వీరేష్‌



నూతనంగా ఎన్నికైన వీరేష్‌, మద్దిలేటి

కర్నూలు(అర్బన్‌): సీ క్యాంప్‌లోని ఏపీ ఎరుకల హక్కుల పోరాట సమితి ( వైహెచ్‌పీఎస్‌) కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా మంత్రాలయానికి చెందిన ఎరుకల వీరేష్‌, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎరుకల మద్దిలేటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ వైహెచ్‌పీఎస్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై రాజు మాట్లాడుతూ వాల్మీకి/బోయలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు చేస్తున్న ప్రయత్నాలను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. నంద్యాల జిల్లా అధ్యక్షులు ఎరుకల గోపాల్‌ మాట్లాడుతూ ఎరుకల ప్రజలను చైతన్యం చేయడంలో వైహెచ్‌పీఎస్‌ తీవ్రంగా కృషి చేస్తున్నదన్నారు. డోన్‌ డివిజన్‌ కార్యదర్శి ఎరుకల రామయ్య మాట్లాడుతూ ఎన్ని కష్టాలు ఎదురైనా తమ పిల్లలను చదివించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీనివాసులు, హనుమేష్‌, బజారి, రవి, పరశురాముడు, భీమరాయుడు, శ్రీను పాల్గొన్నారు.

# చిట్టి గుండె పదిలం

- చిన్నారుల్లో పుట్టుకతో వచ్చే గుండె జబ్బులకు మెరుగైన చికిత్స
- వయసు పెరిగే కొద్దీ తొలగిపోయే కొన్ని సమస్యలు
- తొలిదశలోనే గుర్తిస్తే వెంటనే వైద్యం చేసే అవకాశం
- ఈ నెల 14 వరకు అవగాహన వారోత్సవాలు





కర్నూలు(హాస్పిటల్‌): పుట్టుకతో చిన్నారులకు వచ్చే గుండె జబ్బుల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు చెబుతున్నారు. తొలిదశలోనే గుర్తిస్తే వెంటనే నయం చేయవచ్చని వివరిస్తున్నారు. పుట్టుకతో వచ్చే గుండె జబ్బులను ఎలా నివారించాలో ప్రతి సంవత్సరం ఫిబ్రవరి రెండో వారంలో అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం..

**త్వరగా చికిత్స చేయిస్తే మంచి ఫలితం**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏటా వెయ్యి మంది పిల్లలు గుండె జబ్బుల సమస్యతో జన్మిస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఇటీవల కాలంలో వీటిపై ఒకింత అవగాహన పెరగడంతో లోపాలను తొలిదశలోనే గుర్తించగలుగుతున్నారు. దీనిపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించడం ఎంతైనా అవసరం. గుండెలోపాలకు వీలైనంత త్వరగా చికిత్స చేయిస్తే మంచి ఫలితం కనిపిస్తుందని వైద్యులు సూచిస్తున్నారు.

**గుండెకు వచ్చే సమస్యలు ఇవీ..**

అతి సున్నితమైన గుండెనిర్మాణం సంక్లిష్టమైనది. పిండంలో 21వ రోజుకే గుండె కొట్టుకోవడం, రక్తప్రసరణ మొదలవుతుంది. గుండె గదులు 4 వారాలకల్లా ఏర్పడతాయి. 12 వారాలకు గుండె పూర్తిగా అభివృద్ధి చెందుతుంది. ఈ దశలో ఎక్కడ పొరపాట్లు జరిగినా లోపాలకు దారి తీస్తాయి. వీటిలో ప్రధానంగా చెప్పుకోవాల్సినవి...గుండె రంధ్రాలు(సెప్టల్‌ డిఫెక్ట్స్‌). గుండెలోపాల్లో దాదాపు 25 శాతం ఇలాంటి సమస్యలే ఉంటాయి.

**సమస్యలు గుర్తించడమెలా?**

☛ సాధారణంగా గుండెలో రంధ్రాలు ఏర్పడిన వారిలో ఇవి కనిపిస్తాయి. గుండె గదుల మధ్య రంధ్రాలు ఉన్నప్పుడు చెడు రక్తంతో మంచి రక్తం ఎక్కువగా కలిసిపోతుంది. దీంతో ఊపిరితిత్తులకు మరింత ఎక్కువగా రక్తం చేరుకుంటుంది. ఫలితంగా ఊపిరితిత్తులు తడితడిగా అయిపోతాయి. దీంతో పిల్లలు పాలు సరిగా తాగలేరు. ఆయాసం, తరచూ న్యూమోనియా బారిన పడటం వంటివి వేధిస్తాయి.

☛ చెడు రక్తం, మంచి రక్తం కలిసిపోయి ఒళ్లంతా విస్తరించడం వల్ల పెదాలు, వేళ్లు, నాలుక వంటివి నీలంగా మారతాయి. కొందరికి ఉన్నట్టుండి నీలంగా అవడం ఎక్కువ కావచ్చు. కనుగుడ్లు తేలేయొచ్చు.

☛ గుండె కవాటాలు బిగుసుకుపోతే అలసట, నిస్సత్తువ వంటివి కనిపిస్తుంటాయి. పెద్ద అయ్యాక శారీరక శ్రమను అంతగా తట్టుకోలేరు. ఆటలకు దూరంగా ఉంటుంటారు. తోటివారితో ఆడుకోవడానికి వెనుకాడతారు.

**ఎంత త్వరగా గుర్తించవచ్చంటే!**

గుండెలోపాలను 18 వారాల గర్భంలోనే గుర్తించవచ్చు. ఇందుకు ఫీటల్‌ ఎకో కార్డియోగ్రామ్‌ పరీక్ష బాగా ఉపయోగపడుతుంది. ఇది చాలా సురక్షితం. ఒంట్లోకి గొట్టాలవంటివి పంపించాల్సిన పనిలేదు. సమస్యలను కచ్చితంగా నిర్ధారించవచ్చు. గుండె లోపాలు మున్ముందు ఎలా పరిణమిస్తాయి, బిడ్డ ఆరోగ్యం ఎలా ఉండగలదు అనేవి తెలుస్తాయి. దీన్ని బట్టి ముందుగానే శస్త్రచికిత్సలను నిర్ణయించుకోవచ్చు. కవాటాలు మూసుకుపోయిన వారికి కొన్నిసార్లు గర్భంలో ఉండగానే సరిదిద్దే పద్ధతులూ అందుబాటులో ఉన్నాయి.

**గుండె లోపాలు పోతాయా?**

గుండె, ఊపిరితిత్తుల పనితీరు బాగా అర్థం కావడం, అధునాతన పరికరాలు అందుబాటులోకి రావడం, సుశిక్షితులైన సిబ్బంది, శస్త్రచికిత్స అనంతరం సేవలవంటివన్నీ గుండెలోపాలతో సంభవించే మరణాలకు అడ్డుకట్ట వేయడానికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. అధునాతన చికిత్సలతో చాలా వరకు గుండెలోపాలను పూర్తిగా సరిదిద్దవచ్చు. కొందరికి తొలిదశలో ఆయా లక్షణాల నుంచి ఉపశమనం కలిగించే చికిత్సలు అవసరపడొచ్చు. పూర్తిగా సరిదిద్దడం సాధ్యం కాని వారికి అవసరమైనప్పుడల్లా ఉపశమన చికిత్సలు చేయాల్సి ఉంటుంది. ముందుగానే గుండె రంధ్రాలను గుర్తించగలిగితే తగు మందులు ఇవ్వడం, ఆహార పరంగా జాగ్రత్తలు పాటించడం ద్వారా దుష్ప్రభావాలు ముంచుకురాకుండా చూసుకోవచ్చు. ఇందుకోసం మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. రక్తహీనత మూలంగా గుండె విఫలమయ్యే ముప్పు పొంచి ఉండం వల్ల ఐరన్‌ కూడా ఇవ్వాల్సి ఉంటుంది.

**కారణాలు ఇవీ..**

పిండం ఎదిగే సమయంలో గుండెలోపాలు తలెత్తడానికి రకరకాల అంశాలు దోహదం చేస్తాయి.

☛ **పోషకాల లోపం:** ముఖ్యంగా ఫోలిక్‌ యాసిడ్‌, విటమిన్‌ బి12 లోపం గర్భస్థ శిశువులో గుండెలోపాలకు దారి తీయవచ్చు.

☛ **గర్భిణికి ఇన్‌ఫెక్షన్లు :** తొలి మూడు నెలల్లో ముఖ్యంగా పిండంలో గుండె ఏర్పడే దశలో రుబెల్లా వంటి వైరల్‌ ఇన్‌ఫెక్షన్లు సైతం లోపాలకు దారి తీయొచ్చు.

☛ **మేనరికపు వివాహాలు:** మేనరికపు వివాహం చేసుకున్న వారికి పుట్టబోయే పిల్లల్లో జన్యుపరమైన కారణాలతోనూ గుండె లోపాలు తలెత్తవచ్చు. మేనరికపు వివాహాలు చేసుకున్న వారికి పుట్టబోయే పిల్లల్లో ప్రతి వెయ్యి మందిలో 40 నుంచి 50 మందికి గుండెలోపాలు ఉండే అవకాశం ఉంది. వీరికి ఇతరత్రా లోపాల ముప్పూ ఎక్కువే.

☛ **జన్యులోపాలు:**కొందరికి జన్యులోపాలతోనూ గుండెనిర్మాణ ప్రక్రియ అస్తవ్యస్తం కావచ్చు.

☛ **పురుగుల మందులు, రేడియేషన్‌ :** గర్భం ధరించిన తొలివారాల్లో పురుగుల మందులు, రేడియేషన్‌, కొన్ని రకాల మందుల ప్రభావానికి గురైనా గుండెలోపాలు తలెత్తవచ్చు.

☛ **పొగ, మద్యం అలవాట్లు :** గర్భధారణ సమయంలో పొగతాగడం, మద్యం తాగడం వంటి అలవాట్లతోనూ గుండె ఏర్పడే ప్రక్రియ అస్తవ్యస్తం కావచ్చు. ఇది లోపాలకు దారి తీయొచ్చు.

**60శాతం రంధ్రాలు అవే పూడిపోతాయి**



గుండెలో పుట్టుకతో ఏర్పడిన దాదాపు 60శాతం రంధ్రాలు వాటంతటవే మూసుకుపోతాయి. వీటికి శస్త్రచికిత్సలు అవసరం లేదు. గుండెలోపాలతో పుట్టిన వారిలో దాదాపు 20 శాతం మందికి పుట్టిన నెలలోపే శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుంది. మిగిలిన వారిలో చాలా మందికి బడికి వెళ్లే వయస్సులో శస్త్రచికిత్స చేయాల్సి రావచ్చు. శిశువుకు, అదీ గుండెకు శస్త్రచికిత్స అంటే భయం కలగడం సహజమే. ఇప్పుడు అంత భయపడాల్సిన పనేమీ లేదు. గుండెలోపాల్లో దాదాపు 30 శాతం సమస్యలను గొట్టం సాయంతో చేసే శస్త్రచికిత్సలతోనే సరిచేయొచ్చు. ఇందులో ఎలాంటి మచ్చ ఏర్పడదు. పిల్లలు త్వరగా కోలుకుంటారు. పల్మనరీ స్టెనోసిస్‌, అయోర్టిక్‌ స్టెనోసిస్‌ వంటి సమస్యలకు గుండెలోకి బెలూన్స్‌ పంపి, దాన్ని ఉబ్బించడం ద్వారా కవాటాలను వెడల్పు చేస్తారు. గుండెలో రంధ్రాలను అంబ్రెల్లా పరికరాలతో సమర్థవంతంగా మూసెయ్యవచ్చు. జఠరిక గోడ రంధ్రాలను మూసివేయడానికి ప్రస్తుతం కోనార్‌ ఎంఎఫ్‌ పరికరం సైతం అందుబాటులో ఉంది.

–డాక్టర్‌ సీహెచ్‌. రాజ్‌కుమార్‌, ఇంటర్వెన్షనల్‌ కార్డియాలజిస్ట్‌, కర్నూలు

**ఆరోగ్యశ్రీలో ఉచితంగా శస్త్రచికిత్సలు**



పుట్టుకతో చిన్నారులకు వచ్చే గుండెజబ్బులకు డాక్టర్‌ వైఎస్‌ఆర్‌ ఆరోగ్యశ్రీలో ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తున్నారు. కర్నూలులోని ఓ ప్రైవేట్‌ ఆసుపత్రితో పాటు తిరుపతిలోనూ ఈ చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. కర్నూలులో క్లిష్టమైన కేసులను హైదరాబాద్‌లో నిర్వహిస్తారు. ఎక్కడ చేసినా ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చికిత్స అందుకోవచ్చు. అయితే చిన్నారికి ఉన్న గుండె సమస్య, వారి వయస్సు తదితర అంశాలను బట్టి వైద్యులు శస్త్రచికిత్స చేయాలా వద్దా, శస్త్రచికిత్స చేయాల్సి వస్తే ఎప్పుడు చేయాలనేది నిర్ణయిస్తారు.

–డాక్టర్‌ రఘు, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్‌, కర్నూలు

### శ్రీశైలంలో గుండెపోటుతో యువకుడి మృతి



మృతి చెందిన మహేష్‌ఆచారి

శ్రీశైలం: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలానికి వచ్చిన కర్నూలు నగరం అశోక్‌నగర్‌కు చెందిన మహేష్‌ ఆచారి(30) గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. వైద్యులు తెలిపిన వివరాల మేరకు.. మహేష్‌ ఆచారి దర్శనానికి ముందే శనివారం రాత్రి గ్యాస్‌ఫామ్‌ అయినట్లు చెప్పడంతో అవసరమైన మందులు, ఇంజక్షన్లను ఇచ్చి పంపించామన్నారు. ఆదివారం ఉదయం క్యూలైన్‌ వద్దకు వెళ్లగానే ఛాతినొప్పి తీవ్రం కావడంతో అతనితో వచ్చిన వారు వెంటనే వైద్యశాలకు తీసుకువచ్చారన్నారు. ప్రాథమిక చికిత్స చేసినా ఫలితం లేకుండా పోయిందని, గుండెపోటుతో మృతి చెందారని డాక్టర్లు పేర్కొన్నారు. మహేష్‌తో పాటు వచ్చిన బంధువులు మాట్లాడుతూ.. మహేష్‌ ఆచారికి నాలుగు నెలల క్రితమే వివాహమైందని, వారం రోజుల క్రితమే అతని మేనమామ మృతి చెందారని తెలిపారు. శ్రీశైలం వచ్చాక తీవ్ర మానసిక ఒత్తిడికి లోను కావడంతో పాటు గ్యాస్‌ ఎగదన్ని ఊపిరి పీల్చుకోలేకపోయాడన్నారు. వెంటనే వైద్యశాలకు తీసుకువచ్చినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మహేష్‌ భార్య మూడు నెలల గర్భవతి అని తెలిపారు. దేవస్థానం అంబులెన్స్‌ ద్వారా మహేష్‌ మృతదేహాన్ని కర్నూలుకు తీసుకువెళ్లారు.

### వివాహిత ఆత్మహత్య



శాంతి షర్మిల(ఫైల్‌)

బేతంచెర్ల: భర్త మందలించాడని క్షణికావేశంలో ఓ మహిళ ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పట్టణంలోని అనురాధ థియేటర్‌ సమీపాన ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ లింగమయ్య తెలిపిన వివరాల మేరకు.. సిమెంట్‌నగర్‌ గ్రామానికి చెందిన ఈపనగండ్ల మద్దిలేటి, ఆయన భార్య శాంతి షర్మిల బేతంచెర్లలో నివాసం ఉంటున్నారు. మద్దిలేటి దుబాయ్‌లో పనిచేస్తూ అప్పుడప్పుడూ వచ్చి వెళ్తుండేవాడు. ఆదివారం తెల్లవారుజామున దుబాయి నుంచి భార్య శాంతి షర్మిలతో ఫోన్‌లో మాట్లాడుతూ మందలించాడు. దీంతో క్షణికావేశానికి లోనై ఇంట్లో ఉన్న ఫ్యానుకు ఉరి వేసుకొని శాంతి షర్మిల (36) ఆత్మహత్య చేసుకుంది. వీరికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు మైత్రేష్‌(5) ఏడ్చుకుంటూ బయటకు రావడంతో ఇంటి పక్కల వారు వచ్చి చూడగా ఉరి వేసుకొని శాంతి షర్మిల ఉండటంతో నంద్యాలలో ఉన్న ఆమె పెద్దమ్మ కుమారుడు మణికంఠకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ లింగమయ్య తెలిపారు.

### సినీఫక్కీలో చోరీ

బొమ్మలసత్రం: పట్టణంలోని చందనా బ్రదర్స్‌ బంగారు దుకాణంలో సినీ ఫక్కీలో రూ.2లక్షలు విలువ చేసే నాలుగు తులాల బంగారు చైన్‌ను చోరీ చేశారు. టూటౌన్‌ సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 10వ తేదీన గుర్తు తెలియని వ్యక్తి బంగారు కొనేందుకు చందన బ్రదర్స్‌ షాపులోకి వెళ్లాడు. అక్కడే ఉన్న సేల్స్‌ మ్యాన్‌ శివకుమార్‌ రకరకాల బంగారు చైన్లు చూపించాడు. అయితే నాలుగు తులాల చైన్‌ గుట్టు చప్పుడు కాకుండా జేబులో వేసుకొని తాను వెంట తెచ్చుకున్న మరో చైన్‌ను ఎవరూ చూడకుండా ఆభరణాల్లో కలిపాడు. శనివారం బంగారు ఆభరణాలను తనిఖీ చేస్తున్న సమయంలో నకిలీ బంగారుగా దుకాణం సిబ్బంది గుర్తించారు. వెంటనే సీసీ కెమెరాలు పరిశీలించి గుర్తు తెలియని వ్యక్తి చైన్‌ను దొంగిలించినట్లు గుర్తించారు. చందన బ్రదర్స్‌ సిబ్బంది ఫిర్యాదు మేరకు టూటౌన్‌ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

### మద్యంమత్తులో ఇరువర్గాల ఘర్షణ

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోకి కనకాంబిక రెస్టారెంట్‌లో ఆదివారం మద్యంమత్తులో ఇరువర్గాల వారు దాడి చేసుకున్నారు. టూటౌన్‌ సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు నడిగడ్డ వీధికి చెందిన ఇబ్రహీం తన స్నేహితులతో కలిసి మద్యం సేవించేందుకు బారుకు వెళ్లాడు. తనకు ఎదురుగా అదేవీధికి చెందిన సుబ్బయ్య తన స్నేహితులతో మద్యం సేవిస్తుండగా ఇరువురికి ఘర్షణ నెలకొంది. ఈ క్రమంలో సుబ్బయ్య తన చేతిలో ఉన్న మద్యం సీసాతో ఇబ్రహీంపై దాడి చేశారు. ఇరువర్గాలు దాడి నేపథ్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మార్చి 10లోపు ఆటోమేటిక్‌ బాయిలర్‌ సిస్టం

- శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షుడు రెడ్డివారి చక్రపాణిరెడ్డి



స్టీమ్‌ బాయిలర్‌ ఇంజినీర్‌తో మాట్లాడుతున్న రెడ్డివారి చక్రపాణిరెడ్డి

శ్రీశైలంటెంపుల్‌: శ్రీశైలంలో మార్చి 10వ తేదీలోపు ఆటోమేటిక్‌ ప్రెజర్‌ స్టీమ్‌ బాయిలర్‌ సిస్టంను ఏర్పాటు చేస్తున్నామని శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి తెలిపారు. టెక్నికల్‌ ఆపరేటర్‌ లేకపోవడం వల్లనే అన్నదాన మందిరంలో శనివారం స్టీమ్‌ బాయిలర్‌ ప్రమాదం చోటుచేసుకుందని నిపుణులు గుర్తించారు. దీంతో ఆదివారం అధికారులతో కలిసి రెడ్డివారి చక్రపాణిరెడ్డి అన్నదాన భవనాన్ని పరిశీలించారు. బాయిలర్‌ ఇంజినీర్‌ను పిలిపించి చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీశైల దేవస్థానంలో గత మూడు నెలల్లో రెండు సార్లు స్టీమ్‌ బాయిలర్‌ పేలుడు సంభవించిందన్నారు. ఇకపై ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకోసం నూతనంగా ఆటోమేటిక్‌ ప్రెజర్‌ స్టీమ్‌ బాయిలర్‌ సిస్టంను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రూ.39లక్షలతో ఎస్‌వీఈ ఇంజనీరింగ్‌ కంపెనీతో టెండర్‌ కుదిరిందని తెలిపారు. ఈ సిస్టం ద్వారా రోజుకు 20వేల మందికి సైతం భోజనం తయారు చేయవచ్చన్నారు. ఏదేని సమస్య వచ్చినా తక్షణమే అలారం మోగుతుందని, తద్వారా సమస్యను పరిష్కరించవచ్చన్నారు. దీనిని ప్రీఫ్యాబ్రికేటెడ్‌ రూంలో ఏర్పాటు చేస్తున్నామని, ఇన్‌స్టలేషన్‌లోనే ఆరు లెవల్స్‌లో తనిఖీలు ఉంటాయని పేర్కొన్నారు. నూతన స్టీమ్‌ బాయిలర్‌ ఏర్పాటు చేసేవరకు తాత్కాలికంగా టెక్నికల్‌ ఆపరేటర్‌ను నియమించి నిరంతరం పర్యవేక్షణ చేపట్టేలా ఏర్పాటు చేసినట్లు చైర్మన్‌ వివరించారు. ఈ పరిశీలనలో దేవస్థాన సహాయ కమిషనర్‌ వెంకటేష్‌ ఉన్నారు.

## వైభవంగా తిమ్మప్ప స్వామి రథోత్సవం



అశేష జనవాహిని మధ్య రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

మద్దికెర: మండల పరిధిలోని ఎడవలి గ్రామంలో తిమ్మప్ప స్వామి ఉత్సవాలలో భాగంగా ఆదివారం అశేష జనవాహిని మధ్య తిమ్మప్ప, దడేధూళప్ప, యడివళ్లప్ప స్వామి రథోత్సవం కనుల పండువగా జరిగింది. ముందుగా స్వామి వారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, సహస్ర అష్టోత్తర నామం కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య, మంగళ వాయిద్యాల నడుమ ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకొచ్చి రథంపై కొలువుంచారు. అనంతరం రథం ముందు హోమం కాల్చారు. అశేష జనవాహిని మధ్య స్వామి వార్ల రథోత్సవం నిర్వహించారు. రథోత్సవం తిలకించడానికి జనం భారీగా తరలివచ్చారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## ప్రపంచంలో భారత దేశానికి పెరిగిన గౌరవం

- కేంద్ర టెలీ కమ్యూనికేషన్‌ శాఖ మంత్రి దేవుసిన్హా చౌహాన్‌



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి దేవుసిన్హా చౌహాన్‌

ఆదోని అర్బన్‌/కర్నూలు(సెంట్రల్‌): ప్రపంచంలో భారతదేశానికి గౌరవం పెరిగిందని కేంద్ర టెలీ కమ్యూనికేషన్‌ శాఖ మంత్రి దేవుసిన్హా చౌహాన్‌ అన్నారు. ఆదివారం ఆదోని పట్టణంలో విద్యావంతుల, కర్నూలులో మేధావుల సదస్సును నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో కేంద్ర మంత్రి మాట్లాడుతూ ప్రపంచంలో కొన్ని దేశాలు దివాలా తీశాయని, ఆ దేశ ప్రధానమంత్రులు పరిపాలన చేతగాక రాజీనామా చేస్తున్నారన్నారు. భారతదేశంలో 80 కోట్ల మందికి ఉచితంగా సబ్సిడీ బియ్యం, మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కేంద్ర బడ్జెట్‌లో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యతను ఇచ్చినట్లు చెప్పారు. కాగా.. వీర శైవ లింగాయత్‌లను ఓబీసీ జాబితాలోకి చేర్చాలని మంత్రిని ఆ సంఘం అధ్యక్షుడు శివరుద్రప్ప, నాయకులు కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాలంకి రామస్వామి, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్‌, పార్లమెంట్‌ బాధ్యుడు డాక్టర్‌ పార్థసారథి, నాయకులు పార్థసారథి, కళింగ నరసింహవర్మ, విట్టా రమేష్‌, కాశీ తదితరులు పాల్గొన్నారు.

### భక్తులను ఆలయానికి చేర్చి.. అనంతలోకాలకు

మంత్రాలయం రూరల్‌: భక్తులను ఆలయానికి చేర్చి గుండెపోటుతో డ్రైవర్‌ మృతి చెందిన సంఘటన మంత్రాలయంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన తిరుపతయ్య కుమారుడు సైదులు ప్రైవేటు ట్రావెల్స్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత ప్రయాణికులతో మంత్రాలయం చేరుకున్నాడు. ప్రయాణికులు ఆర్టీసీ బస్టాండ్‌ సమీపంలోని జీపీఎస్‌ రెసిడెన్సీలో బస చేయగా డ్రైవర్‌ సైదులు టెంపో ట్రావెలర్‌లో నిద్రపోయాడు. తెల్లవారుజామున సైదులు (45)కు గుండెపోటు రావడంతో వాహనంలోనే కన్నుమూశాడు. ఉదయం గమనించిన ప్రయాణికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు మంత్రాలయం చేరుకుని మృతదేహాన్ని సొంత గ్రామానికి తీసుకెళ్లారు.

### వైభవంగా స్వాతి వేడుకలు

ఆళ్లగడ్డ: అహోబిల క్షేత్రంలో ఆదివారం స్వాతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. దిగువ అహోబిలంలోని యాగశాలలో ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ఉగ్రనరసింహస్వామిని కొలువుంచారు. అభిషేకం, అర్చన, తిరుమంజనం నిర్వహించిన అనంతరం ఉత్సవమూర్తులను నూతన వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పండితుల వేదమంత్రోచ్చరణల మధ్య శ్రీ స్వాతి, శ్రీసుదర్శన హోమాలు నిర్వహించారు. పూర్ణాహుతితో కార్యక్రమాన్ని ముగించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



స్వాతి, సుదర్శన హోమంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు